## క్లుప్తంగా

### జగనన్న కాలనీలో బోరు ఏర్పాటు



**ఆత్మకూరురూరల్(మర్రిపాడు):** మర్రిపాడు మండలం బూదవాడ పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో గురువారం రాత్రి బోరు ఏర్పాటు చేశారు. గృహ నిర్మాణాలను లబ్ధిదారులు ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాల మేరకు బోరు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ హరిబాబు తెలిపారు. ఉపసర్పంచ్ సిరిగిరి ఈశ్వర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, నాయకులు భేరి రామ్మోహన్‌రెడ్డి, ఓంకారం శివరాజు, రామకృష్ణారెడ్డి, లక్ష్మయ్య, వెంకటేష్, శ్రీను, తదితరులు పర్యవేక్షించారు.

### కామ్రేడ్ కొండమూరికి ఘన నివాళి



**ఆత్మకూరు:** పట్టణానికి చెందిన సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ కొండమూరి పెద్ద మస్తానయ్య వర్ధంతిని గురువారం నిర్వహించారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో కొండమూరి చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు మాట్లాడుతూ పెద్ద మస్తానయ్య బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉంటూ వారి సమస్యలపై నిరంతరం పోరాడడంతో పాటు పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. సీపీఎం నాయకులు గంటా లక్ష్మీపతి, షేక్ సందాని, ఆళ్ల హజరత్తయ్య, వాగాల శ్రీహరి, జేవీవీ, యూటీఎఫ్ నాయకులు హరికృష్ణ, మురళీకృష్ణ, శివప్రసాద్, గద్దర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

### వీఆర్‌ఏల నూతన కార్యవర్గ ఎన్నిక



**నెల్లూరు(పొగతోట):** గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏ) సంఘ అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటశివయ్య, భానుచందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని రెవెన్యూ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వీఆర్‌ఏల సమావేశానికి ఏపీఆర్‌ఎస్‌ఏ నేత బొబ్బాల మురళి, వీఆర్‌ఏల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య హాజరయ్యారు. అనంతరం వీఆర్‌ఏల సంఘ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, రాజేష్, కార్యదర్శిగా ప్రేమదాస్, కోశాధికారిగా కేశవరావును ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా రవీంద్ర, అమీర్, అశోక్, చిన్న అంకయ్య ఎన్నికయ్యారు.

### వేడుకగా లక్ష తులసీ దళార్చన



**నెల్లూరు(బృందావనం):** తొలి ఏకాదశిని పురస్కరించుకొని సుజాతమ్మ కాలనీలోని కృష్ణయోగ, అష్టలక్ష్మి ఆలయంలో విశేష పూజలను గురువారం నిర్వహించారు. దత్త పీఠాధీశ్వరుడు గణపతి సచ్చిదానంద స్వామి, దత్తపీఠ ఉత్తరాధిపతి దత్త విజయానందతీర్థ అనుగ్రహంతో పూజలను నిర్వహించామని గణపతి సచ్చిదానంద కృష్ణజ్ఞాన బోధ సభ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ సర్వేపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. భగవద్గీత పారాయణం, కృష్ణుడికి మహా హారతులను నిర్వహించారు.

### మణి సంస్మరణ సభ



**నెల్లూరు(వేదాయపాళెం):** వ్యక్తి శ్రేయస్సు కన్నా సమాజ శ్రేయస్సుకే మణి బుక్ స్టాల్ వ్యవస్థాపకుడు, ప్రముఖ హేతువాది టీపీ మణి అధిక ప్రాధాన్యమిచ్చారని పలువురు పేర్కొన్నారు. మణి సంస్మరణ సభను నెల్లూరు పట్టణ రోడ్డు మార్జిన్ వ్యాపారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సండే మార్కెట్ గౌరవాధ్యక్షుడు శరవణ్, ప్రముఖ పాత్రికేయుడు ఆలూరు రాఘవశర్మ, చిన్నపిల్లల వైద్యుడు దుర్గేష్, కాళిదాసు పురుషోత్తం, ప్రజావైద్యశాల సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, మాల్యాద్రి, సునీత, సండే మార్కెట్ కమిటీ నేతలు హఫీజ్, సెంథిల్‌కుమార్, చంద్రన్, తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు

**కావలి:** త్యాగానికి ప్రతీకగా జరుపుకొనే బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మసీదుల్లో గురువారం సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మతపెద్దలు బక్రీద్ సందేశాన్ని ఇచ్చారు. త్యాగం మనిషిని ఉన్నతుడిని చేస్తుందని, మహ్మద్ ప్రవక్త త్యాగానికి గుర్తుగా జరుపుకొనే బక్రీద్ పర్వదినం త్యాగనిరతి, సహనం, పేదలపై జాలి, దయ కలిగి ఉండాలనే సందేశాన్ని ఇస్తుందన్నారు. ప్రతి ముస్లిం పంచ సూత్రాలను ఆచరిస్తూ అల్లాపై విశ్వాసంతో ప్రతిరోజూ ఐదుసార్లు నమాజ్ చేయాలన్నారు. మహ్మద్ ప్రవక్త బోధించిన సమైక్యత, సోదర భావాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని ఆకాంక్షించారు.

**ఉదయగిరి:** బక్రీద్‌ను పురస్కరించుకుని ఉదయగిరిలోని ఈద్గా మైదానంలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. ముస్లిం మత గురువులు బక్రీద్ సందేశాన్ని అందజేశారు. అలాగే వింజమూరులోని బంగ్లా సెంటర్‌లోని ఈద్గా మైదానంలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. వింజమూరు పరిసర ప్రాంతాలకు చెందిన ముస్లింలు పెద్దసంఖ్యలో ప్రార్థనల్లో పాల్గొన్నారు.

**వరికుంటపాడు:** మండలంలోని ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పెద్దిరెడ్డిపల్లి, తోటలచెరువుపల్లి, విరువూరు, తిమ్మారెడ్డిపల్లి, వరికుంటపాడు, తూర్పుబోయమడుగుల, హుస్సేన్‌గర్, తదితర గ్రామాల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు మతపెద్దలు బక్రీద్ సందేశాన్ని వినిపించారు.

**జలదంకి:** మండలంలోని ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. జలదంకి, బీకేఅగ్రహారం, గట్టుపల్లి, జమ్మలపాళెం, సోమవరప్పాడు, కృష్ణాపాడు, చోడవరం, తదితర గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం సోదరులు సామూహిక నమాజులు చేశారు. ముస్లిం మతపెద్దలు బక్రీద్ పర్వదినం సందేశాన్ని ఇచ్చారు. బక్రీద్ త్యాగానికి ప్రతీకని, సొంత ప్రయోజనాల కన్నా దైవజ్ఞానం, నిస్వార్థ సేవ గొప్పదని బక్రీద్ పర్వదినం చాటి చెబుతుందని వివరించారు. త్యాగమంటే ఆత్మార్పణ చేసుకోవడం కాదని, మనకు ఉన్నంతలో దానం చేయడం, ఆకలితో ఉన్న వారిని ఆదరించడం అని పేర్కొన్నారు.

**అల్లూరు:** స్థానిక జామియా మసీద్, బీసీ కాలనీలోని మదీనా మసీద్‌లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం మతపెద్దలు



అల్లూరులోని జామియా మసీద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

బక్రీద్ సందేశాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో ఇమామ్ అఙ్మల్, మసీదుల ప్రెసిడెంట్లు సమద్, మహబూబ్‌బాషా, ముతవలి ఉస్మాన్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

**కొండాపురం:** మండలంలోని ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. కొమ్మి, కొండాపురం, తూర్పుయర్రబల్లి, వెంకటరంగాపురం, తదితర గ్రామాల్లోని ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక నమాజులు చేశారు.

**ఆత్మకూరురూరల్:** మండలంలోని ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మహిమలూరు, కరటంపాడు, బట్టేపాడు, అప్పారావుపాళెం, నల్లపరెడ్డిపల్లి, దేపూరు, అశ్వనీపురం, బోయలచిరివెళ్ల, నబ్బీనగరం, వాశిలి, నాగులపాడు, తదితర గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానాలు చేశారు.

**ఆత్మకూరురూరల్(మర్రిపాడు):** మర్రిపాడు మండలంలోని ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మర్రిపాడు, పడమటినాయుడుపల్లి, నందవరం, కృష్ణాపురం, అల్లంపాడు, కంపసముద్రం, తదతర గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం మతపెద్దలు బక్రీద్ సందేశాన్ని అందజేశారు.

**ఆత్మకూరు:** పట్టణంలోని ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలు చేశారు. తొలుత పీర్లచావిడి, సత్రం సెంటర్ల నుంచి ముస్లింలు ర్యాలీగా బయలుదేరి ఈద్గా మైదానానికి చేరుకున్నారు. అనంతరం సామూహిక ప్రార్థనలు చేశారు. మసీదు మౌజమ్‌లు బక్రీద్ సందేశాన్ని అందజేశారు. ఖురాన్ సూత్రాలు, ప్రతి ముస్లిం అనుసరించాల్సిన జీవన విధులను వివరించారు. అల్లాహ్ దయతో అవకాశం ఉన్న ప్రతిఒక్కరూ పేదలకు సహాయం చేయాలని సూచించారు. అనంతరం ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈద్గా వెలుపల పలువురు పేదలకు శక్తి కొలది దానాలు చేశారు. కాగా ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బక్రీద్‌ను సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారని వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు పేర్కొన్నారు.

**చేజర్ల:** మండలంలోని ఆదూరుపల్లి, ఉలవపల్లి, చేజర్ల, తదితర గ్రామాల్లోని ముస్లింలు బక్రీద్‌ను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. చేజర్లలోని జామియా మసీదులో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు బక్రీద్ సందేశాన్ని అందజేశారు. మసీదు కమిటీ చైర్మన్ షేక్ మస్తాన్, షేక్ సిరాజుద్దీన్, అబ్దుల్ రెహమాన్, షేక్ సుబాని, మహమ్మద్ షాబాజ్, మౌజన్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

**అనంతసాగరం** మండలంలోని ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. అనంతసాగరంలోని ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలు చేశారు. ముస్లిం మత పెద్దలు బక్రీద్ పర్వదినం సందేశాన్ని అందజేశారు.



ఉదయగిరి: ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కావలి: పెద్ద మసీదు ప్రాంగణంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



జలదంకిలో..



కరటంపాడు ఈద్గా మైదానంలో..



అల్లూరు: మదీనా మసీద్‌లో బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొటున్న ముస్లింలు



ఆత్మకూరులోని ఈద్గా మైదానంలో..



చేజర్లలోని జామియా మసీదులో...



మర్రిపాడు మండలం నందవరంలో..

## సచివాలయ కన్వీనర్ల నియామకం

**ఉదయగిరి/కావలి/ఆత్మకూరు:** వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉదయగిరి, కావలి, ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మండల సచివాలయ కన్వీనర్లను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది.

**ఉదయగిరి:** ఉదయగిరికి కల్లూరి కృష్ణారెడ్డి, వరికుంటపాడుకు దుగ్గిరెడ్డి వెంకటేష్, వింజమూరుకు మందాడి బ్రహ్మారెడ్డి, సీతారామపురానికి బాలినేని పెదమాబయ్య, కొండాపురానికి బొడ్డు మాధవరావు, కలిగిరికి మారెళ్ల మధుసూదన్‌రెడ్డి, జలదంకికి తిప్పారెడ్డి ఇందిరమ్మ, దుత్తలూరుకు అడుసుమల్లి శ్రీహరినాయుడును నియమించారు.

**కావలి:** కావలి మండల కన్వీనర్‌గా పోలేపల్లి అనిల్‌కుమార్‌రెడ్డి, కావలి క్లస్టర్–1కు పానుగోటి అనూరాధ, క్లస్టర్–2కు కనుపర్తి రాజశేఖర్, బోగోలుకు కర్తం సురేందర్‌రెడ్డి, అల్లూరు మండలానికి కోమిట్ల పవన్‌కుమార్‌రెడ్డి, నగర పంచాయతీకి షేక్ ఉస్మాన్‌షరీఫ్, దగదర్తికి పోలేపల్లి అనిల్ కుమార్‌రెడ్డి నియమించారు.

**ఆత్మకూరు:** ఆత్మకూరు పట్టణానికి సీహెచ్ ఆదిశేషయ్య, మండలానికి వల్లభనేని రాజేంద్రనాయుడు, అనంతసాగరానికి బీ అంకిరెడ్డి, అనుమసముద్రంపేటకు పులిమి రమేష్‌రెడ్డి, చేజర్లకు పూనూరు బాలగంగాధర్‌రెడ్డి, మర్రిపాడుకు ఎస్ మోహన్‌రెడ్డి, సంగానికి ముడి మల్లికార్జునరెడ్డి నియమించారు.

## ఎస్సై బాధ్యతల స్వీకరణ



**బిట్రగుంట:** బిట్రగుంట ఎస్సైగా శేఖర్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు దిశ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఆయన్ని సాధారణ బదిలీల్లో భాగంగా బిట్రగుంట స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బిట్రగుంట ఎస్సైగా శేఖర్‌బాబు బాధ్యతలు స్వీకరించి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**ఆత్మకూరు:** నెల్లూరు, ఆటోనగర్‌లోని ఏపీ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి మైనార్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ టీ కామేశ్వరి తెలిపారు. గురువారం ఆమె పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న ఏపీ బాలికల గురుకుల పాఠశాల నుంచి గురుకులాల ప్రిన్సిపాళ్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత కలిగిన ముస్లిం, క్రిస్టియన్, ఇతర మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు ధ్రువీకరణపత్రాలతో నేరుగా గురుకులంలో దరఖాస్తు చేసుకుని అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. ఆత్మకూరు గురుకులం ప్రిన్సిపల్ శారదాఅన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం వైఎస్ జగన్‌కు అల్లా ఆశీస్సులు ఉండాలి

- ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

**ఉదయగిరి:** రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఉదయగిరి అసెంబ్లీ నియోజవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రార్థించారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా ఉదయగిరిలోని ఈద్గా మైదానంలో నిర్వహించిన సామూహిక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగాలకు ప్రతీకగా జరుపుకొనే బక్రీద్ పర్వదినం హిందూ, ముస్లిం సోదరుల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తోందన్నారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాజారెడ్డిని ముస్లిం పెద్దలు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు నజీమొహిద్దీన్, జిల్లా పరిషత్ కోఆప్టెడ్ సభ్యుడు షక్ గాజుల తాజాద్దీన్, ఉదయగిరి ఉపసర్పంచ్ ముర్తుజా, జేవీవీ దస్తగిరిఅహ్మద్, యువ నాయకులు షేక్ షర్ఫుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరి ఈద్గాలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొని మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

# మర్యాదపూర్వకంగా..



రాజగోపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న దళిత సంఘాల నాయకులు



రాజగోపాల్‌రెడ్డిని కలిసిన వింజమూరు వైఎస్సార్‌సీపీ నేతలు

**ఆత్మకూరురూరల్(మర్రిపాడు):** ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా నియమితులైన మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని పలువురు దళిత సంఘాల నేతలు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని స్వగృహంలో రాజగోపాల్‌రెడ్డిని కలిసి శాలువా, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ,బీసీ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కాగి శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకుడు బంతిపూడి వెంకట్రావు, దళిత సంఘాల నాయకులు తాటిపర్తి రఘురామ్, కాకి అంకయ్య, పల్లాల అబ్రహం, బొడ్డు జేమ్స్, నూనె ప్రభాకర్, ఇమ్మాన్యూయేల్, సాంబయ్య, తిరుపతయ్య, అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**వింజమూరు (ఉదయగిరి):** ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా నియమితులైన మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని బ్రాహ్మణపల్లిలోని ఆయన నివాసంలో వింజమూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి వారితో మాట్లాడుతూ 2024లో ఉదయగిరిలో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించేందుకు కృషి చేయాలి కోరారు. రాజగోపాల్‌రెడ్డిని కలిసిన వారిలో వింజమూరు సర్పంచ్ నల్లగొండ్ల సృజన, సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు, ఎంపీటీసీ పురుషోత్తం, జేసీఎస్ కన్వీనర్ ఎం బ్రహ్మారెడ్డి, మైనార్టీ నేత నజీర్ బాషా, అల్లూరి వాణి, వార్డు సభ్యులు ప్రసాద్, బాలయ్య, మురళి, తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



ఘటనా స్థలంలో క్షతగాత్రులు

**దుత్తలూరు:** మండలంలోని పాపంపల్లి సమీపంలో గురువారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు..ఉదయగిరి మండలం గండిపాళేనికి చెందిన రామకృష్ణ, శ్రీకాంత్ తమ స్నేహితుడ్ని కలిసేందుకు మోటార్‌సైకిల్‌పై నందిపాడుకు వచ్చారు. స్నేహితుడ్ని కలిసి తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో పాపంపల్లి సమీపంలో ఎదురుగా వాహనం రావడంతో రోడ్డు మార్జిన్ దిగారు. తిరిగి రోడ్డుపైకి వచ్చే క్రమంలో మోటార్‌సైకిల్ అదుపుతప్పడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అటుగా వస్తున్న వాహనదారులు గమనించి చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## సీఐకు సన్మానం



**ఉదయగిరి:** కావలి డివిజన్‌లో పలు కీలక కేసుల ఛేదనలో ముఖ్యపాత్ర పోషించిన ఉదయగిరి సీఐ గిరిబాబుకు ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఉదయగిరిలోని సర్కిల్ కార్యాలయంలో సీఐను రెడ్డి సంఘం నాయకులు గురువారం శాలువా, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి, సీతారామపురం మండలాల నేతలు కల్లూరు రాజారెడ్డి, బేరి భాస్కర్‌రెడ్డి, బద్వేల్ శ్రీనివాస రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మంద కృష్ణ పర్యటన జయప్రదానికి పిలుపు

**కలిగిరి:** వింజమూరు మండలం గుండెమడకలలో వచ్చే నెల 9న ఎమార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పర్యటించనున్నారని ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ అంబేడ్కర్ మాదిగ తెలిపారు. కలిగిరిలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుండెమడకలలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మంద కృష్ణమాదిగ ఆవిష్కరించనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.



సమావేశమైన ఎమ్మార్పీఎస్ నాయకులు

ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నందిపోగు వెంగళరావు, గోసాల కొండలరావు, స్వర్ణ కొండయ్య, రొడ్డా హజరత్, వెంగయ్య, సుధీర్, నాగేశ్వరరావు, రవి, తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా మయూర వాహనసేవ

**నెల్లూరు రూరల్:** కనుపర్తిపాడులోని వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు మేష, మయూర వాహనాలపై గురువారం దర్శనమిచ్చారు. గ్రామోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉభయకర్తలుగా బుర్లా శ్రీనివాసులురెడ్డి, పద్మలత, మెట్టా రాజగోపాల్‌రెడ్డి, స్నిగ్ధ, స్వనిక్‌రెడ్డి, గాదెం సుధాకర్, లక్ష్మీప్రసన్న, అరిగెల శివకుమార్, శివజ్యోతి వ్యవహరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు.

## జగనన్న సురక్ష సర్వేను బాధ్యతగా నిర్వహించాలి

**వరికుంటపాడు:** జగనన్న సురక్ష సర్వేను బాధ్యతగా నిర్వహించాలని తహసీల్దార్ సయ్యద్‌ఇక్బాల్ అన్నారు. మండలంలోని పెద్దిరెడ్డిపల్లి సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి సర్వేపై వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రతి గడపకు వెళ్లి జగనన్న సురక్షలో భాగంగా ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న 11 రకాల సేవలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సేవలను గుర్తించాలన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఇక్బాల్

అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారిని గర్తించి నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వేడుకగా తొలి ఏకాదశి

**ఆత్మకూరు:** పట్టణ ప్రజలు తొలి ఏకాదశి పర్వదినాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. తొలిపండగ కావడంతో ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. తూర్పువీధిలోని పురాతన శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవదేవేరుల మూలవిరాట్‌లకు విశేషాలంకరణ చేశారు. కాశీనాయన ఆశ్రమంలో జ్ఞాన సరస్వతి, కాశీ విశ్వేశ్వరస్వామి, వనదుర్గ, తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీస్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు.

**ఆత్మకూరురూరల్:** మండల ప్రజలు తొలి ఏకాదశి పర్వదినాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మహిమలూరులోని వేణుగోపాలస్వామి ఆలయం, వాశిలిలోని వరదరాజస్వామి ఆలయం, మురగళ్లలోని రామాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు దేవదేవేరులను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**వరికుంటపాడు:** మండల ప్రజలు తొలి ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా జరుపుకొన్నారు. పెద్దిరెడ్డిపల్లి, విరువూరు, వరికుంటపాడు, జడదేవి, రొంపిదొడ్ల, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయాన్నే ఆలయాలకు చేరుకుని దేవదేవేరులను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**కొండాపురం:** తొలి ఏకాదశి పర్వదినాన్ని మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనగలు, బెల్లంతో చేసిన పిండిని నైవేద్యంగా సమర్పించారు.



మురగళ్లలోని రామాలయంలో విశేషాలంకరణలో సీతారామచంద్రులు

## అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

**కావలి:** గురుపౌర్ణమిని పురస్కరించుకుని వచ్చే నెల 2న కావలి ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలం క్షేత్రానికి రెండు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2న ఉదయం 8 గంటలకు బస్సులు బయలుదేరి రాత్రికి అరుణాచలం చేరుకుంటాయని చెప్పారు. గిరి ప్రదక్షిణ అనంతరం బయలుదేరి 3న సాయంత్రం కావలి డిపో చేరుకుంటాయని వివరించారు. ప్రత్యేక బస్సు సర్వీసులకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యంతో పాటు డిపోలోనూ టికెట్లు ఇస్తున్నట్లు తెలిపారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.